







రసవత్తరంగా.. పార్లమెంట్ పోరు!

- జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో త్రిముఖ పోటీ
- పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న ప్రధాన పార్టీలు
- పోటాపోటీగా ఎన్నికల సన్నాహక సమావేశాలు
- రైతు సమస్యలపై గళం వినిపిస్తున్న ప్రతిపక్షాలు
- లోక్‌సభ పరిధిలో గెలుపు కోసం కాంగ్రెస్ ఆరాటం
- మూడోసారి గెలుపు కోసం బీఆర్ఎస్ దృష్టి
- గెలుపే లక్ష్యంగా బీజేపీ ప్రయత్నాలు

కామారెడ్డి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో ఈసారి ఎన్నికలు రసవత్తరంగా మారనున్నాయి. మొన్నటి వరకు పార్లమెంట్ పరిధిలో ద్విముఖ పోటీ ఉంటుందని అంతా అనుకున్నా ప్రస్తుత పరిస్థితుల్లో త్రిముఖ పోటీ తప్పేటట్టు లేదు. ఈ పార్లమెంట్ ఎన్నికలను ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పోలింగ్ నాటికి పోలింగ్ మేనేజ్‌మెంట్ చేసేందుకై ప్రధాన పార్టీలు తమ శ్రేణులను సమాయత్తం చేస్తున్నాయి. ఇందులో భాగంగా జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో కార్యకర్తలతో పోటాపోటీగా ప్రధాన పార్టీలు సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే ఈ లోక్‌సభ స్థానం నుంచి బరిలో దిగే నేతలపేర్లను ప్రకటించాయి. కాంగ్రెస్ అభ్యర్థిగా సురేష్ షెట్కార్, బీఆర్ఎస్ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్, బీజేపీ అభ్యర్థిగా బీబీ పాటిల్ పోటీ పడనున్నారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్నందున అభ్యర్థులు తమ ప్రచారాన్ని ముమ్మరం చేసేందుకు ప్రణాళికలను రూపొందించుకుంటున్నారు. అభ్యర్థులతో పాటు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం అవుతున్నారు.

ఇన్‌చార్జీల నియామకం

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే మూడు ప్రధాన పార్టీలు జహీరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బరిలో దిగే నేతల పేర్లను ప్రకటించాయి. కాంగ్రెస్ నుంచి సురేష్ షెట్కార్, బీఆర్ఎస్ అభ్యర్థిగా గాలి అనిల్‌కుమార్, బీజేపీ తరఫున బీబీ పాటిల్ పోటీ పడనున్నారు. ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మూడు పార్టీలు ఎన్నికల ఇన్‌చార్జీలను ఇప్పటికే ప్రకటించాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా మంత్రి దామోదర్ రాజనర్సింహ, బీఆర్ఎస్ ఇన్‌చార్జ్‌గా మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీ‌ష్‌రావు, బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జీగా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి వ్యవహరిస్తున్నారు. మూడు పార్టీలు పార్లమెంట్ నియోజకవర్గం అంతటా పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నాయి.

అధికారంతో కాంగ్రెస్‌లో ఉత్సాహం

రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా నాలుగింటిలో పార్లమెంట్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తుండడంతో కాంగ్రెస్‌లో ఉత్సాహం పెరిగింది. ఎంపీ అభ్యర్థి గెలుపు బాధ్యత సదరు ఎమ్మెల్యేలతో పాటు ముఖ్యనేతలదేనని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి వారం రోజుల కిందట జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికలపై ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సారి ఎలాగైన విజయం సాధించాలని ఆ పార్టీ నేతలు ఆరాటపడుతున్నారు. పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కార్ గతంలో ఐదేళ్ల పాటు జహీరాబాద్ ఎంపీగా కొనసాగారు. దీంతో ఆయనకు నియోజకవర్గాల్లో పరిచయాలు ఉన్నాయి. దీనికి తోడు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడం, ఆందోల్ నుంచి గెలుపొందిన దామోదర్ రాజనర్సింహ మంత్రిగా పని చేస్తుండడం, కామారెడ్డికి చెందిన షబ్బీర్‌అలీ ప్రభుత్వ సలహదారుడిగా ఉండడంతో మరో ముగ్గురు ఎమ్మెల్యేలు ఉండడంతో పార్టీ శ్రేణులు క్రియాశీలకంగా పని చేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గాల వారిగా కార్యకర్తల సన్నాహక సమావేశాలను స్థానిక ఎమ్మెల్యేల సహకారంతో అభ్యర్థి సురేష్ షెట్కార్ లోక్‌సభ నియోజకవర్గం అంతటా పర్యటిస్తున్నారు.

బీఆర్ఎస్‌కు బలమైన క్యాడర్

రాష్ట్రంలో పదేళ్ల పాటు అధికారంలో కొనసాగిన బీఆర్ఎస్ పార్టీకి పార్లమెంట్ నియోజకవర్గం అంతటా బలమైన క్యాడర్ ఉంది. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో బాన్సువాడ, జహీరాబాద్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందారు. జుక్కల్‌లో బీఆర్ఎస్ స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందింది. మిగితా నియోజకవర్గాల్లోనూ పార్టీకి బలమైన క్యాడర్ ఉంది. ఇటీవల బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల కోసం కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో సన్నా హక సమావేశాలు నిర్వహించగా కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజర య్యారు. ఈ సమావేశాల్లో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులు హాజరై పార్టీ శ్రేణుల్లో భ" లో సా

నింపారు. సీనియర్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్ని నియోజక వర్గాల్లో తిరుగుతూ పార్టీ నేతలను సమన్వయం చేస్తున్నారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన పార్లమెంట్ ఎన్నికల్లో విజయంతో సత్తా చాటాలని బీఆర్ఎస్ నేతలు చూస్తున్నారు. మాజీ మంత్రి హరీష్‌రావు లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా వ్యవహ రిస్తున్నారు. అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ నియోజకవర్గంలో పర్యటిస్తూ సమావేశాలు నిర్వహిస్తూ ప్రచారం చేపడుతున్నారు.

ఈ ఎన్నికల్లో సత్తా చాటాలనుకుంటున్న బీజేపీ

జరగనున్న జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో ఈసారి బీజేపీ సత్తా చాటాలనుకుంటుంది. ఈ లోక్‌సభ పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండగా కామారెడ్డిలో మాత్రమే బీజేపీ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మిగితా అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులు ఇటీవల జరిగిన ఎన్నికల్లో మూడో స్థానంలో నిలిచారు. అయితే పార్లమెంట్ ఎన్నికలలో సత్తా చాటడానికి బీజేపీ సిద్ధమయింది. అయోధ్య రామ మందిర నిర్మాణం కల నెరవేరడం, నరేంద్రమోదీ చరిష్మా కలిసివస్తాయని ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నారు. కేంద్రం అమలు చేసిన పథకాలతో జనంలోకి వెళ్తున్నారు. నరేంద్రమోదీని మూడోసారి ప్రధానిగా చేసుకోవాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి వ్యవహరిస్తున్నారు. అభ్యర్థి బీబీ పాటిల్ సైతం లోక్‌సభ నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రచారం చేపడుతున్నారు. గెలుపే లక్ష్యంగా బీజేపీ ప్రచార కార్యక్రమాలను చేపడుతోంది.



జిల్లాలో.. కల్తీ కల్లు జోరు!

- హానికర రసాయనాలతో తయారీ
- ఒక్కసారి అలవాటైతే అంతే సంగతులు
- అనారోగ్యం పాలవుతున్న అమాయక ప్రజలు

భిక్కనూరు, ఏప్రిల్ 7: ఇటీవల కల్లుకు చాలా డిమాండ్ పెరిగింది. స్వచ్ఛమైన కల్లును తాగడం వల్ల ఆరోగ్యానికి మంచి చేకూరుతుందని గతం నుంచి ఉన్న గత పది సంవత్సరాలుగా ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్పడం, రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కల్లు, నీరా స్టాళ్లను ఏర్పాటు చేయడంతో ఈ ఈత, తాటి కల్లుకు పల్లె, పట్టణ ప్రాంతాల్లో మరింత డిమాండ్ పెరిగింది. గత ప్రభుత్వంలో చేపట్టిన హరిత హారం కార్యక్రమంలో భాగంగా గ్రామగ్రామాన ఈత, తాటి వనాలను సైతం పెంచింది. ఈ అవకాశాన్నే ఆసరాగా చేసుకున్న కొందరు కల్తీ కల్లు వ్యాపారులు కామారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో హానికర నిషేధిత రసాయనాలతో కృత్రిమ కల్లును తయారీ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. కాలకూట విషాన్ని అమాయకమైన పేదల కడుపుల్లోకి నింపుతూ జేబులు దండీగా నింపుకుంటున్నారు. ఈ కల్తీకల్లు బారిన పడిన చాలా మందికి అనారోగ్య సమస్యలు తలెత్తి ఆసుపత్రుల పాలై వారి జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారు. ఒక్కసారి అమాయకులు ఆ కల్తీకల్లుకు అలవాటైతే ఇక అంతే పరిస్థితి, దాని బారి నుంచి బయటకు రావడం చాలా కష్టం. జిల్లాలోని చాలా చోట్ల ఆల్ఫాజోలం, డైజోఫాం, క్లోరోహైడ్రెట్‌తో పాటుగా నిషేధిత మత్తు పదార్థాలతో ఈ కల్తీకల్లును తయారు చేస్తున్నట్లు సమాచారం. మరికొన్నిచోట్ల స్వచ్ఛంగా దొరికే కల్లుతో పాటుగా నిషేధిత పదార్థాలను కలిపి తయారు చేస్తున్నారు. ఇటీవల ఈ కల్తీకల్లుకు అలవాటు పడి ఎక్కువగా యువకులు విచిత్రంగా ప్రవర్తిస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. రోజు ఏదో పని చేసి అలిసిపోయిన పేద ప్రజలు కాసింత విశ్రాంతి కోసం చేసిన కష్టాన్ని మరిచిపోయేందుకు పలు ప్రాంతాల్లో లభ్యమవుతున్న ఈ కల్తీ కల్లు తాగి మత్తుకు బానిసలవుతున్నారు.

హానికర రసాయనాలతో తయారీ

జిల్లాలోని పలు ప్రాంతాల్లో కల్తీ కల్లు వ్యాపారులు నిషేధిత మత్తు పదార్థాలైనా డైజోఫాం, ఆల్ఫాజోలం, క్లోరోహైడ్రెట్, గంజాయి వంటి వాటితో కల్తీ కల్లును తయారు చేస్తున్నట్లు సమాచారం. మరికొన్ని చోట్ల కొంత ఈత కల్లును, ఈ నిషేధిత మత్తు



పదార్థాలను కలిపి తయారు చేస్తున్నట్లు పుకార్లు చాలానే ఉన్నాయి. బ్రాండి, విస్కీ తాగినా ఎక్కనంత మత్తు ఈ కల్తీ కల్లు తాగితే ఎక్కుతుందని, ఒక్కసారి ఈ కల్తీ కల్లు అలవాటైనా వారు ఈత చెట్టు నుంచి తీసిన కల్లు ముందు పెట్టిన వారు సీసల్లోని ఈ కల్తీ కల్లే కావాలంటున్నారని పలువురు వాపోతున్నారు.

కల్తీ కల్లుతో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

- హేమిమా, మండల వైద్యాధికారిణి, భిక్కనూరు.

ఈ కల్తీ కల్లును తాగడం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం ఉంటుంది. ఈ కల్తీలో ఉపయోగించే డైజోఫాం, ఆల్ఫాజోలం, క్లోరో హైడ్రెట్ వంటి వాటితో ఎక్కువగా నరాలకు, మెదడుకు సంబంధించిన వ్యాధులు రావడానికి ఎక్కువగా ఆస్కారం ఉంది. దీనికి అలవాటు పడిన వారు సమయానికి అది దొరకకపోవడంతో వింతగా ప్రవర్తిస్తుంటారు. ఎక్కువగా ఆలోచించడం, తొందరగా కోపోద్రిక్తులవుతారు. ఈ కల్తీకల్లుకు దూరంగా ఉండ టమే ఉత్తమం.

అనారోగ్యం పాలవుతున్న అమాయక పేదప్రజలు

ఈ నిషేధిత మత్తు పదార్థాలతో తయారు చేసిన కల్తీకల్లు మానవ శరీరానికి తీవ్ర ప్రమాదమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ కల్తీ కల్లుకు బానిసలైనవారు కళ్లు సరిగ్గా కనిపించకపోవడం, మెదడు మొద్దువారి జ్ఞాపకశక్తి తగ్గడం, మూత్రపిండాల వ్యాధులు రావడం, జీర్ణకోశ సంబంధిత వ్యాధుల బారిన పడటంతో పాటుగా కాళ్లు, చేతులు లాగడం, మూతి వంకర పోవడం, మాటలు నత్తిరావడం, తలనొప్పితో ఆసుపత్రుల పాలవుతున్నారు. నిత్యం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ వారి విలువైనా జీవితాన్ని చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. ముఖ్యంగా నరాలు, మెదడుకు సంబంధించి వ్యాధులతో ఆసుపత్రుల్లో చేరి పెద్దఎత్తున ఖర్చుల పాలవుతున్నారు.

వింతగా ప్రవర్తిస్తున్న మందుబాబులు

ఈ కల్తీకల్లుకు బానిసలైనవారు ఉన్నట్టుండి వింతగా ప్రవర్తిన్నారు. కల్లు దొరకని సమయంలో ముఖ్యంగా గత కరోనా సమయంలో చాలా మంది ఈ కల్తీ బారినపడి వింతగా ప్రవర్తించిన సంఘటనలను చూశాం. కరోనా సమయంలో చాలా మంది కల్లు దుకాణాలు మూసి ఉంచడంతో ఈ కల్లు దొరకకా టవర్లు ఎక్కడం, పెదపెద్ద భవనాలను ఎక్కడం, చెట్లపై ఎక్కి కూర్చోవడం, రోడ్ల మధ్యలో పడుకోవడం ఇలా పలు రకాలుగా వింతగా ప్రవర్తించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సైతం అక్కడక్కడా ఇలాంటి వింత సంఘటనలు వింటూనే ఉన్నాం. ఇలా ప్రవర్తిన్న వారిలో యువకులే అధికంగా ఉన్నారు.

కల్తీకల్లును కుండల్లో పోసి దర్జాగా అమ్మకాలు

ఇటీవల ఎక్కువగా రోడ్ల పక్కన కల్లు కుండలు, క్యాన్లు దర్శనమిస్తున్నాయి. పలుచోట్ల ఇప్పుడే చెట్టు నుంచి తీసుకువచ్చామని స్వచ్ఛమైన చెట్టు కల్లు అంటూ పలువురు ఈ కల్తీకల్లును దర్జాగా విక్రయిస్తున్నారు. కల్తీకల్లులో కొద్దిగా సోపు దంచి పోసి స్వచ్ఛమైన నీరా అంటూ అమాయకులను బొల్తా కొట్టిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. ఈ కల్తీని కుండల్లో పోసి ఒక్కో కల్లు కుండా రూ.100 చొప్పున, నీరా రూ.200 నుంచి 350 వరకు విక్రయిస్తున్నారు. నిజమైనా కల్లు అనుకుని వారికే తెలియకుండా అమాయక ప్రజలు చాలా మంది ఈ కల్తీకల్లుకు అలవాటు పడుతున్నారు.

కల్లు దుకాణాల్లో మద్యం సిట్టింగులు

బయట ఎక్కడ మద్యం తాగినా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడం, జరిమానాలు విధిస్తుండటంతో ఎక్కువగా మందు బాబులు కల్లు దుకాణాలను అడ్డాగా చేసుకుంటున్నారు. ఈ కల్లు దుకాణాల్లో స్నాక్స్‌తో పాటుగా మద్యం తాగిన అనంతరం కల్లు తాగొచ్చన్న ఉద్దేశ్యంతో కల్లు దుకాణాల్లో ఇటీవల ఎక్కువగా మద్యం తాగుతున్నారు. కల్లు దుకాణాల్లో మద్యం తాగిన అనంతరం ఈ కల్తీని తాగిన వారు విచక్షణ కోల్పోయి ఇతరులతో గొడవలు పడటం, దాడులు చేయడం చేస్తూ నానా హంగామా చేస్తున్నారు.

బాన్సువాడలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ



కాంగ్రెస్ త్యాగధనుల పార్టీ

- దేశంలో ప్రజలు మార్పు కోరుతున్నారు
- గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు
- ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- మంత్రి దామోదర రాజనర్సింహ

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 7: కాంగ్రెస్ పార్టీ త్యాగధనుల, త్యాగమూర్తుల పార్టీ అని, దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించిందని, కాంగ్రెస్ పార్టీకి ఉన్న దేశభక్తి మరే ఇతర పార్టీలకు లేదని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామాత్యులు దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం బాన్సువాడ పట్టణంలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకరవర్గ అభ్యర్థి సురేష్ షెట్కార్ గెలుపు కోసం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ నాయకుల, కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఓటు వేసే ముందు ఆలోచించాలని, ఈ రోజు మనం వేసే ఓటు భవిష్యత్తు కోసం ఉపయోగపడాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 10 సంవత్సరాలు కేసీఆర్ కుటుంబ పాలన చూశామని, అదే విధంగా జాతీయ స్థాయిలో మోదీ పాలన చూశామన్నారు. కానీ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో ప్రజా నిర్ణయంతో మార్పు సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో నాలుగింటిని అమలు చేశామని, మరో రెండు గ్యారెంటీలను తప్పక అమలు చేసి తీరుతామన్నారు. అదేవిధంగా రాహుల్‌గాంధీ కూడా దేశ ప్రజల సంక్షేమం కోసం గ్యారెంటీలను అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఖచ్చితమైన కమిట్‌మెంట్ ఉంటుందని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి, జిల్లా నాయకులు కైలాస్ శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్, నాయకులు మాసాని శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రాంరెడ్డి, యలమంచలి శ్రీనివాస్‌రావు, కొత్తకొండ భాస్కర్, నార్ల రత్నకుమార్, మోహరిల్ శ్రీనివాస్, పాత బాలకృష్ణ, శంకర్‌గౌడ్, నార్ల సురేష్, మాసాని శేఖర్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

నాయకులే కాదు కార్యకర్తలు కూడా గెలవాలి

ఎన్నికల్లో నాయకులే గెలవడం కాదు, జెండా మోసే కార్యకర్తలు కూడా గెలవాలని ఆయన ఆకాంక్షించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రతీ నాయకుడు జవాబుదారీగా ఉండాలని, ప్రజలు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు.

దామోదర నోట వైఎస్ రాజశేఖర్ రెడ్డి మాట

రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ బాన్సువాడ పట్టణంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కమిట్‌మెంట్, మాటకు కట్టుబడి ఉండే పార్టీ అని, అందుకు స్వర్గీయ ముఖ్యమంత్రి డా. రాజశేఖర్‌రెడ్డిని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ, 108 సేవలు, 104 సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలతో ఇప్పటికీ ప్రజలు రాజశేఖర్‌రెడ్డిని గుర్తు చేసుకుంటారని తెలిపారు.

సోమారం తండాలో విష జ్వరాలు

- కీళ్లనొప్పులతో జ్వరం భారిన పడుతున్న ప్రజలు
- కానరాని వైద్య బృందం

గాంధారి, ఏప్రిల్ 7: గాంధారి మండలంలోని సోమారంతండాలో గత వారం రోజుల నుంచి గిరిజనులు మంచానపడ్డారు. తండాలో గిరిజనులకు విషజ్వరాలు, కీళ్ల నొప్పులు రావడంతో అల్లాడుతున్నారు. యువకులు, పెద్దా చిన్న తేడా లేకుండా అందరు మంచాన పడుతున్నారు. సోమారం తండాతో పాటు ఇతర తండాల్లోని గిరిజనులు కూడా ఈ వ్యాధు లకు గురవుతున్నారు. ఏం చేయాలో తెలియక పీఎంపీ, ఆర్ఎంపీలను సంప్రదిస్తూ వారి సూచనల మేరకు వైద్యం పొందుతున్నారు. వారం పాటు మంచాన పడినా వైద్య అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని పేర్కొంటున్నారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నా వైద్యం అందించడంలో స్థానిక వైద్యసిబ్బంది విఫలమవు తున్నారు. కనీసం జిల్లా కలెక్టరైనా స్పందించి వైద్యం అందేలా చూడాలని తండావాసులు కోరుతున్నారు.



సోమారం తండాలో జ్వరంతో బాధపడుతున్న గిరిజనులు

ఘనంగా ప్రభుస్వామి రథోత్సవం

లింగంపేట, ఏప్రిల్ 7: మండలంలోని అయ్యపల్లి అడవుల్లో వెలసిన స్వయంభూ ప్రభుస్వామి రథోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా స్వామి వారి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శనివారం అర్ధరాత్రి నుంచి భజన, వరాహ పూజ, పల్లకిసేవతో పాటు ఆదివారం తెల్లవారు జామున రథోత్సవాన్ని నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి జిల్లాలోని వివిధ మండలాలతో పాటు మెదక్, నిజామాబాద్ జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

బోనాల్‌లో కుస్తీ పోటీలు

మండలంలోని బోనాల్ గ్రామంలో ప్రభుస్వామి జాతర ఉత్సవాల సందర్భంగా కుస్తీపోటీలను ఘనంగా నిర్వహించారు. పోటీలను తిలకించేందుకు మండలం లోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులతో పాటు మెదక్, నిజామాబాద్‌లకు చెందిన వస్తాదులు పోటీలో పాల్గొన్నారు. కుస్తీ పోటీలు రసవత్తరంగా జరిగాయి. కుస్తీపోటీల్లో చివరి పోటీలో వెండి కడియంను సిద్దాపూర్‌కు చెందిన వస్తాద్ గోపాల్ గెలుచుకున్నాడు. అతనికి ఎస్సై చైతన్యకుమార్ వెండి కడియంను బహూకరించారు.



ప్రభుస్వామి ఆలయం వద్ద రథోత్సవంలో భక్తులు

తొర్లికొండలో నూతన వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి విరాళాలు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 7: మండలంలోని తొర్లికొండ గ్రామంలో కొండపై నూతనంగా నిర్మిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం నిర్మాణానికి భక్తులు, గ్రామస్థులు భారీగా విరాళాలు అందజేశారు. ఆదివారం గ్రామంలో ఆలయ కమిటీ సభ్యులు ఇంటింటికీ వెళ్లగా భక్తులు, గ్రామస్థులు ఈ విరాళాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


విరాళాలు అందజేస్తున్న తొర్లికొండ గ్రామస్థులు

నేడు కాంగ్రెస్ పార్టీ కార్యకర్యకర్తల విస్తృత స్థాయి సమావేశం

● పార్లమెంటు అభ్యర్థి జీవన్ రెడ్డి రాక... ఇఫ్తార్ విందు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకుల దృశ్యం

బోధన్ రూరల్, ఏప్రిల్ 7: బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిజామాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి రానున్నారని పేర్కొన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఏఆర్ గార్డెన్‌లో కార్యకర్తల సమావేశంలో పార్లమెంటు అభ్యర్థి జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిలు ఎన్నికల నేపథ్యంలో కార్యకర్తలతో మాట్లాడుతారని తెలిపారు. అనంతరం అప్నా ఫంక్షన్ హాలులో సాయంత్రం ఆరు గంటలకు నియోజకవర్గ మైనార్టీ నాయకులకు ఇఫ్తార్ విందు కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మైనార్టీలు పాల్గొనాలని కోరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మొయినుద్దీన్, హరికాంత్ చారీ, మండల అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, శరత్ రెడ్డి, దాము, ఖలీం, షర్ఫొద్దీన్, తలారి నవీన్‌లతో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

నేడు కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం

● హాజరుకానున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ, ఎంపీ అభ్యర్థి

ధర్పల్లి, ఏప్రిల్ 7: మండల కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్ తెలిపారు. ఈ సమావేశానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నగేష్‌రెడ్డిలు హాజరవుతున్నట్లు ఆయన చెప్పారు. ఉదయం 11గంటలకు మండల కేంద్రంలోగల మున్నూరుకాపు కళ్యాణ మండపంలో జరిగే ఈ ఆత్మీయ సమ్మేళానికి మండలంలోని అన్ని గ్రామ శాఖల అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు, పార్టీ కార్యకర్తలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు ఆయన తెలిపారు.

దాన ధర్మాలకు ప్రతీక రంజాన్ మాసం

● స్తోమత కలిగిన ప్రతిఒక్క ముస్లింపై జకాత్ నిరేశించబడింది

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 7: దానధర్మాల ద్వార నిరుపేదలను ఆదుకునేందుకు పవిత్రరంమజాన్ మాసంలో ఇస్లాంమతం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తుంది. కల్మాచదవడం ఐదుపూటల నమాజ్‌చేయడం, రంజాన్ మాసంలో ఉపవాసదీక్షలు పాటించడం జీవిత కాలంలో ఒక్కసారైన హజ్‌యాత్ర చేయడం తప్పనిసరిగా నిర్ధేశించిన అల్లాహ్ నీవు సంపాదించుకున్న ఆదాయంలో మిగులు ఆదాయంలో రెండున్నర శాతం నిరుపేదలకు జకాత్ రూపంలో దానంచేయడం కూడ అల్లాహ్ తప్పనిసరి అంశాల్లో చేర్చారు. దివ్యఖురాన్ నిర్ధేశించిన ఐదు అంశాలకు కట్టుబడి ఉండడానికి ముస్లీంలు ప్రవక్త (మహమ్మద్ సల్లెఅల్లైహి వసల్లం) అదేశాలను తూచాతప్పక ఆచరిస్తారు. ఇందులో భాగంగానే రంజాన్ మాసం దాన ధర్మాలకుప్రతీకగా నిలుస్తోంది.

● జకాత్‌అంటే..

ఇస్లాంమతంలో పాటించాల్సిన ఐదు అంశాల్లో జకాత్ ఒకటి. స్తోమత కలిగిన ఏ ఒక్క ముస్లీంకు జకాత్ నుంచి మినహాయింపు ఉండదు. పేదరికంలో ఉన్నవారు ఏ ఒక్కరు కూడ ఆకలితో అలమటించే దుస్థితి రాకూడదన్నదే దీని ముఖ్య ఉద్దేశం. సమాజంలో పేద ధనిక అనే అంతరాన్ని తగ్గించడమే జకాత్ ముఖ్యఉద్దేశమని పవిత్ర మత గ్రంథం దివ్యఖురాన్ బోధిస్తుంది.

● జకాత్ విధివిధానాలు

స్తోమత కలిగిన ప్రతి ముస్లీం జకాత్ కడు నిరుపేదలకు దానం చేయాల్సిందే తన దగ్గర 7 తులాల బంగారం, 52.5 తులాల వెండి లేదా అంతే విలువకలిగిన అస్థి ఉన్నా తప్పనిసరి జకాత్ కు అర్హులవుతారు. ఇప్పటి మార్కెట్ ధరలెక్కన రెండున్నరశాతం డబ్బులు పేదలకు దానంచేయాలన్నది దివ్యఖురాన్‌లో చేప్పబడింది.

● జకాత్ ఎవరికి ఇవ్వాలి : షేఖ్ అహ్మద్ పాషా కమ్మర్‌పల్లి

జకాత్ రూపంలో దాన, ధర్మాలు చేయడానికికూడ అల్లాహ్ ఖురాన్ ల్లో కొన్ని షరతులువిధించాడు. దంపతులు ఇద్దరుకూడ సంపాదన పరులైతే వారిద్దరుకూడ తమమిగులు ఆదాయంలో రెండున్నర శాతం దానం చేయాలని సూచించాడు. జకాత్ ఇచ్చే వ్యక్తియెక్క ముందు మూడు తరాలు, వెనకమూడు తరాల సంబధికులు జకాత్ పొందడానికి అనర్హులు. నిరుపేదలు, అనాథశరణయాలు, రక్తసంబంధీకులు కాకుండా దారిద్ర్యరేఖకు దిగువన ఉండి, ఆర్థిక ఇబ్బందుల్లో గడుపుతున్న కుటుంబాలకు మాత్రమే జకాత్ రూపంలో దానం చేయాలి రంజాన్ మాసంలో నిరుపేదవారికి ఇస్తే వారుకూడ అందరితో సమానంగా పండగను జరుపుకుంటారని దీని ముఖ్యోద్దేశం. మామూలు రోజుల్లో దానాలకన్న రంజాన్ మాసంలో దానం 70 రెట్ల పుణ్యాలభిస్తోందని మహమ్మద్ ప్రవక్త ఆదేశం.

విలువలతోనే మానవజాతి మనుగడ



గ్రామంలో పల్లకిసేవ నిర్వహిస్తున్న భక్తులు

ధర్పల్లి, ఏప్రిల్ 7: విలువలతోనే మానవజాతి మనుగడ జరుగుతుందని జిల్లా సత్యసాయి కోఆర్డినేటర్ ఈశ్వర్ అన్నారు. ఆదివారం మండలంలోని దుబ్బాక గ్రామంలో మానవ జీవితలక్ష్యం అనే కార్యక్రమంపై వక్తలు ప్రసంగించారు. ఈ సందర్భంగా గ్రామంలో సత్యసాయి పల్లకీసేవను నిర్వహించారు. ధ్వజారోహణ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా జరిపారు. అనంతరం గ్రామంలో శోభాయాత్ర నిర్వహించి సాయి కీర్తనలు, భజనలు చేశారు. ఈసందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మికను అలవర్చుకోవాలని సూచించారు. ఆధ్యాత్మిక వల్లే సంఘంలో విలువలు పెరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆధ్యాత్మిక విభాగం మహిళా కోఆర్డినేటర్ కుసుమ, జిల్లా సత్యసాయి సేవాసంస్థల అధ్యక్షులు శ్రీనివాస్, స్టేట్ కోఆర్డినేటర్ ప్రవీణ్, జిల్లా బాలవికాస్ ఇన్‌చార్జి మంజుల, శంకర్, పుష్పలత, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ట్రాక్టర్ ఢీ

● యువకుని మృతి

రుద్రూరు, ఏప్రిల్ 7: ద్విచక్ర వాహనం, ట్రాక్టర్ ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన రుద్రూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రుద్రూరు మండలంలోని రాయకూర్ గ్రామ శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాంత్ (25) అనే యువకుడు మృతి చెందాడు. బోధన్ నుంచి ద్విచక్ర వాహనంపై శ్రీకాంత్ రాయకూర్ వైపు వెళుతుండగా రాయకూర్ నుంచి బోధన్ వైపు వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పనికిరాని స్థలం పంచాయతీలకు అప్పగింత



ఏఆర్పీ గ్రామంలో అక్రమంగా వెలసిన లే అవుట్ దృశ్యం

● లే అవుట్లలో పంచాయితీ స్థలంపై ప్రజల అభ్యంతరం.
● ప్రభుత్వ నిర్మాణాలు చేపట్టేదెట్లా ● నాన్ లేఅవుట్ల సంగతేమిటి

ఎడపల్లి, ఏప్రిల్ 7: ఎడపల్లి మండలం బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారిపై నట్టనడుమ ఉంది. ఇరు పట్టణాల ప్రజలు ఈ ప్రాంతంలో ప్రభుత్వ లేఅవుట్, నాన్ లేఅవుట్‌లలో స్థలాలు కొనుగోళ్ల చేపడుతున్నారు. ఇట్టి లేఅవుట్ స్థలాల్లో ప్రభుత్వ నిభందనల ప్రకారం కొంత స్థలాన్ని గ్రామ పంచాయితీకి కేటాయించాల్సి ఉంటుంది. కేటాయించిన స్థలంలో స్థానిక ప్రజల అవసరాల నిమిత్తం తాగునీటి ట్యాంక్ కాని, అంగన్‌వాడి, పాఠశాల భవనాలు కాని, ఇలా ఏదైనా ప్రభుత్వ పరమైన నిర్మాణాలకు ఈ స్థలం వినియోగించాల్సి ఉంటుంది. అయితే పంచాయతీలకు అప్పగించిన లేఅవుట్ స్థలాల భూములలో ఇచ్చిన స్థలం ఎందుకు పనికి రాకుండా ఇష్టారాజ్యంగా ఉంది. దీనిపై స్థానిక లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలు, గ్రామాల ప్రజలు పలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

● ప్రశ్నించేవారు కరువు:

లేఅవుట్ లేని స్థలాల్లో ఇష్టారాజ్యంగా క్రయవిక్రయాలు కొనసాగుతున్న పట్టించుకోని పంచాయతీ గతపాలకవర్గం, ప్రజాప్రతినిధులు, అధికారులు కనీసం సక్రమంగా చేపట్టిన లేఅవుట్లలో పంచాయతీలకు పనికివచ్చే స్థలాన్ని అయినా తీసుకోవడంలో ఎందుకు ఆసక్తి చూపడంలేదని స్థల కొనుగోలు దారులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ప్రజాప్రతినిధుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా కూడా తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

● అంతా మాఇష్టం

ఎడపల్లి మండలంలో ప్రధాన రహదారి ప్రక్కనే ఉన్న అక్రమ, సక్రమ లేఅవుట్ స్థలాల నిర్వాహకులు, యజమానులు, కొనుగోలు చేసిన స్థల యజమానులు, పాలకులు, అధికారులు ప్రభుత్వ నిభందనలను గాలికి వదిలేసి ఇష్టారాజ్యంగా అంతా మాఇష్టం అన్న చందంగా వ్యవహరించడం పలు విమర్శలకు తావిస్తోంది.

● హద్దులు హుష్‌కాకి

ప్రభుత్వ నిబంధనల ప్రకారం లేఅవుట్లలో పంచాయతీలకు ఇచ్చిన స్థలానికి పంచాయతీ గతపాలకవర్గం, అధికారులు హద్దులు ఏర్పాటు చేయకపోవడం వెనుక దాగిఉన్న ఆంతర్యం ఏమిటో అంతు చిక్కడంలేదు. దీంతో అవి రోజురోజుకు కబ్జాలకు గురవుతున్నాయి. ఈ తతంగం ఎక్కువగా ఎడపల్లి, జానకంపేట్, ఏఆర్పీ క్యాంప్, నెహ్రూ నగర్ గ్రామాలలో వెలుగు చూస్తూనే ఉన్న అక్కడి నేతలు, అధికారులు నోరు మెదపక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా మండలంలోని సుమారు 50కి పైగా సక్రమ, అక్రమ లేఅవుట్లు కొనసాగుతున్న వాటిపై పూర్తిస్థాయి నిఘాపెట్టి సక్రమ లేఅవుట్లలో హద్దులతో కూడిన పంచాయతీ స్థలాన్ని ఏర్పాటు చేసుకోవడం, అక్రమ లేఅవుట్ స్థలాలలో కొనసాగుతున్న పనులను అధికారికంగాఅడ్డగించడం చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఎడపల్లి పంచాయతీకి ఇచ్చిన స్థలం ఇదే..

● ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు తప్పవు: ఎంపీవో

ఈ విషయంపై ఆంధ్రజ్యోతి మండల పంచాయతీ అధికారిని వివరణ కోరగా మండలంలో కొనసాగుతున్న అక్రమ లేఅవుట్లపై తమకు ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని మండల పంచాయతీ అధికారి సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఒకవేళ ఏదైనా అభ్యంతరాలు ఉండి ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవని తెలిపారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని టౌన్‌ప్లానింగ్ అధికారులకు నివేదికలో ఇచ్చిన స్థలమే మండల గ్రామ పంచాయితీల లేఅవుట్లలో ఒకటై ఉంటే ఎలాంటి ఇబ్బందులు లేవని, తేడా ఉంటే తప్పకుండా అలాంటివాటి అనుమతులు రద్దుచేస్తామని మండల పంచాయితీ అధికారి సుభాష్ చంద్రబోస్ అన్నారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం!

● భీమ్‌గల్ మున్సిపాలిటీలో కంపు కొడుతున్న కాలనీలు
● పట్టించుకోని అధికారులు

భీమ్‌గల్‌రూరల్, ఏప్రిల్ 7: సంవత్సరానికి సుమారు 2కోట్ల ఆదాయం ఉన్న భీమ్‌గల్ మున్సిపాలిటీలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. భీమ్‌గల్ పురపాలక సంఘం పరిధిలోని 12 వార్డుల్లో సరైన డ్రైనేజీలు లేక పరిసరాలు కంపుకొడుతున్నాయి. మున్సిపాలిటీలో సిబ్బంది ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. ఆరు నెలలు కావస్తున్న ఇప్పటి వరకు దోమలనివారణకు పాంపింగ్ చేయ్యక పోవడంతో దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తున్నాయి. మున్సిపాలిటీ చైర్మెన్ మాత్రం నెలలో ఒక్క సారి కూడా మున్సిపాలిటీ మెట్లు ఎక్కడం లేదని ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. మున్సిపాలిటీ కౌన్సిలర్‌లు తమ వార్డుల్లో కనీసం మురికి కాల్వలు కూడా శుభ్రం చేయడం లేదని వాపోతున్నారు. భీమ్‌గల్ పట్టణంలోని 2 వార్డులో బాబాపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి ప్రక్కనే మురికి కాల్వ లేకపోడంతో మురుగునీరు రోడ్డుపైకి వచ్చి ప్రవహిస్తోంది. మురికికాల్వ లేకపోవడంతో కాలనీవాసులు మున్సిపల్ సిబ్బందికి పలుమార్లు మొరపెట్టుకున్నా డ్రైనేజీని నిర్మించంలేదని వాపోతున్నారు. మురికినీరు పోవడానికి డ్రైనేజీ వ్యవస్థ లేక పోవడంతో కాలనీవాసులు స్వయంగా ఒక గుంతను తీసి అందులోకి మురకి నీరును వదులుతున్నారు. మురకి నీరు నిల్వ వుండడంతో దోమల బెడద ఎక్కువగా వుందని, మురుగునీరు వాసనతో ఇళ్ల లో వుండలేక పోతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ఇంటి పన్ను వసూలు చేసే అధికారులు సమస్యల ను మాత్రం పట్టించుకోవడం లేదని మున్సిపాలిటీలోని 12 వార్డుల్లో ఉన్న సమస్యలను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



రెండో వార్డులో రోడ్డుపైనే నిలిచిన మురికినీరు

జేసీఐ ఇందూరు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

పెద్దబజార్, ఏప్రిల్ 7: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జేసీఐ నిజామాబాద్ ఇందూరు ఆధ్వర్యంలో ఆదివారం ఇండియన్ రెడ్‌క్రాస్‌లో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూర్వ జోన్ ఉపాధ్యక్షుడు విజయ ఆనంద్ హాజరై 45వ సారి రక్తదానం చేశారు. జేసీఐ అధ్యక్షుడు మనోజ్‌కుమార్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని ఈ రక్తం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చి రక్తదానం చేసి విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు శ్రీధర్, నరేందర్‌స్వామి, అశోక్, భూపతి, నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మొద్దు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

మోపాల్,ఏప్రిల్ 7: రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని మధ్య దళారులకు అమ్ముకుని మోసపోవద్దని ప్రాథమిక సహకార సంఘం అధికారులు రైతులకు సూచించారు. ఆదివారం బోర్గాం(పి) సొసైటీ ఆధ్వర్యంలో ఠాణాకుర్దు, బోర్గాం (పి) గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ అధికారులు, కార్యదర్శి కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని మధ్యదళారులకు అమ్మి మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వం గ్రామాల్లో వరిధాన్యాం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు. రైతులు తమ ధాన్యాన్ని ఈ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరక్టర్లు స్థానిక ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల పాల్గొన్నారు.

బస్టాండ్‌లో సీసీ కెమెరాలకు అడ్డంగా బోర్డులు



ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమెరాలకు అడ్డంగా ఉన్న బోర్డులు



ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమెరాలకు అడ్డంగా ఉన్న బోర్డులు

ఆర్మూర్‌టౌన్ , ఏప్రిల్7: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దానికి ఎదురుగా పలు ఛానళ్లలో వచ్చే సీరియల్‌ల అడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డులను ఏర్పాటు చేయడంతో సీసీ కెమెరాలు సగభాగం మాత్రమే పని చేస్తున్నాయి. వారంలో ఒక సారి బస్టాండ్ ప్రాంతంలో ఎవరిదో ఒకరిది దొంగతనం జరుగుతోంది. అట్టి దొంగను పట్టుకోవాలంటే సీసీ కెమెరాల్లో ఏర్పడే పరిస్థితి లేకుండా పోయింది. అలాగే మున్సిపల్ పరిధిలో ఓ వార్డులో నివాసం ఉంటున్న ఓ పెద్దవిడా జీవితంపై విరక్తి చెంది చనిపోతానని చెప్పి బస్టాండ్‌కు వచ్చి బస్సులో వెళ్లిపోయింది. కానీ ఏ బస్‌లో వెళ్లిందో చూడటానికి అక్కడున్న సీసీ కెమెరాలో పరిశీలిస్తే బస్టాండ్‌కు వచ్చినట్టు కనబడుతోందని ఏ బస్సు ఎక్కిందో ఇంకో సీసీ కెమెరాల్లో బస్‌బోర్డు కనబడడంలేదు. సీసీ కెమెరాకు అడ్డంగా ఉన్న అడ్వర్‌టైజ్‌మెంట్ మాత్రమే కనబడుతుంది. ఇప్పటి కైనా సీసీ కెమెరాలకు అడ్డంగా ఉన్న బోర్డులను తొలగించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటులో జాప్యం.

మున్సిపల్ పరిధిలో నిత్యం క్రైం రేటు పెరుగుపోతుంది. ప్రతీ వార్డులో జరుగుతున్న సంఘటనల దృష్ట్యా సీసీ కెమెరాల ఏర్పాటుకు రాజకీయ నాయకులు, వ్యాపారస్థులు, కుల సంఘాల నాయకుల ముందుకు రాకపోవడంతో జాప్యం జరుగుతుంది. ప్రతీరోజు ఏదో ఒక చోట వాహనం దొంగతనం, చైన్‌స్నాచింగ్, సెల్‌ఫోన్ దొంగతనం, తాళం వేసిన ఇండ్లలో చోరీ ఇలా చెప్పుకుంటు పోతే ఇంకా ఎన్నో ఎన్నెన్నో జరుగుతునే ఉన్నాయి. ఇన్ని జరిగిన ప్రధాన కూడలిల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు చేయాల్సి ఉంది. అలాగే గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొన్ని పని చేస్తుండగా మరికొన్ని మరమ్మతులు చేయాల్సి ఉంది. ఇప్పటికైనా సీసీ కెమెరాల ఏర్పాటుకు మున్సిపల్‌లో బడ్జెట్‌ను కేటాయించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

భయాందోళనకు గురవుతున్నాం..

ఇటీవల తెల్లవారు జామున 3గంటల ప్రాంతంలో ముగ్గురు దొంగలు బైక్‌ను దొంగిలించడానికి రావడంతో అప్పుడే మెలుకువ కావడంతో కేకలు వేయడంతో దొంగలు పారరాయ్యరు. ఎప్పుడు ఎవరు దొంగతనానికి వస్తారోనని భయాంధోళనకు గురవుతున్నాం. రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని కోరుతున్నాం.

- కుకునూర్ లింగన్న, హుస్నాబాద్‌గల్లీ, ఆర్మూర్

నిజామాబాద్ జిల్లాలో ఎత్తిపోతల నిర్వహణ భేష్

● రైతులను అభినందించిన ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్
● వన్నెల్(కె) ఎత్తిపోతలను పరిశీలించిన ముథోల్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు



వన్నెల్(కె) ఎత్తిపోతలను పరిశీలిస్తున్న ముథోల్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు

నందిపేట, ఏప్రిల్7: నిజామాబాద్ జిల్లాలో ఎత్తిపోతల పథకాల నిర్వహణ బేషుక్కా ఉందని నిర్మల్ జిల్లా ముదోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. ఆదివారం నందిపేట మండలంలోని వన్నెల్(కె) ఎత్తిపోతల పథకాన్ని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డితో కలిసి ముదోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్, అక్కడి రైతులతో సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. లిఫ్టుల నిర్వహణలో రైతులు, ఇరిగేషన్ అధికారుల సమన్వయం బాగుందని, ఇందులో రైతులను అభినందించక తప్పదన్నారు. ఎత్తిపోతల నిర్వహణ, వినియోగం, పనితీరు, రైతుల పాత్ర గురించి స్థానిక రైతులతో అడిగి తెలుసుకున్నారు. అంతే కాకుండా ఆయకట్టు ఎంత ఉండాలి, నీటిని ఎలా వాడుకోవాలి, ఏ సందర్భంలో పంటలకు నీటిని అందించాలని, ఏలా అందించాలి అని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ స్థానిక రైతులకు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. మరమ్మత్తుల నిర్వహణకు డబ్బులు ఏలా పోగు చేస్తారు, సభ్యత్వం ఏలా తీసుకోవాలి, ఎవరిని తీసుకోవాలి అనే ప్రశ్నలను ఆయన నివృత్తి చేసుకున్నారు. ముందుగా గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న శివాలయంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, స్థానిక నాయకులు లింగారెడ్డి, అబ్బి గంగారాం, కాటిపల్లి గంగారెడ్డి, సురేందర్ , రైతులు తదితరులు ఉన్నారు.



వన్నెల్(కె)లో రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

పశువులకు అందని బీమా పథకం



గ్రామంలోని పశువులు



పాలు విక్రయిస్తున్న రైతు

డొంకేశ్వర్ ఏప్రిల్ 7: ఆర్థికంగా వెనుకబడిన రైతులకు అండగా నిలిచేది పాడి పరిశ్రమ ఒక్కటే. పాడి పరిశ్రమపై ఆధారపడిన ఎన్నో కుటుంబాలకు నిరాశే మిగులుతుంది. లక్షలు ఖర్చు చేసి పశువులను తెచ్చి ఆర్థికంగా అభివృద్ధి పొందాలనే అనుకొనే వారికి సవాలుగా మారింది. లక్షలు విలువ చేసే గేదేలు మృత్యువాత పడుతున్న వాటికి బీమా కరువైంది. పశుగణాభివృద్ధి సంస్థ ద్వారా బీమా పథకం 2017-18 సంవత్సరంలో పశువులకు అందిన బీమా ఇప్పటి వరకు అందలేదు. గేదే, చనిపోతే బీమా పథకం ద్వారా రైతుకు చనిపోయిన పశువు ఖరీదును బట్ట ప్రభుత్వం రైతుకు డబ్బులను చెల్లిస్తోంది. అటువంటి ఏడేళ్లు గడుస్తున్న ఇప్పటి వరకు రైతులకు ఎటువంటి బీమా పథకం అందకపోవడంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్షలు విలువ చేసే మూగజీవాలను కోల్పోయి ఆర్థికంగా నష్టపోతున్నారు. ఓ పక్క పశువులకు సీజనల్ వ్యాధులు బారిన పడి అనారోగ్యానికి గురై మృత్యువాతప డుతున్నాయి. అలా మృతి చెందిన గేదేలకు గత ప్రభుత్వ హయాంలో అనుకొని సంఘటనతో మృతి చెందిన గేదేలకు పశు గణాభివృద్ధి సంస్థ ద్వారా బీమా పథకం పాడి రైతులకు నష్టపరిహారం అందేది. ఈ పథకం ప్రతీపాడి రైతు పశుబీమా కోసం 34శాతం ప్రీమియం చెల్లించాలి. 66శాతం ప్రీమియం చెల్లించి పశుప్రమాదం లేదా సహజ మరణం ద్వారా మృతి చెందితే రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించేది. ఈ పథకం కింద పశువు చనిపోయిన 30నుంచి 45రోజుల్లోగా రైతుకు నష్టపరిహారం రైతుకు అందేది. అయితే పశువులు వందల సంఖ్యలో చనిపోతున్నప్పటికీ బీమా పథకం అమలు లేకపోవడంతో పాడి రైతులు నష్టపోతున్నారు. పశుబీమా పథకం అమలులో ఉంటే ప్రమాదం మృతి చెందిన పశువులకు రైతులకు ఎంతో అసరగా ఉండేదని పలువురు పాడి రైతులు అభిప్రా యం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు మేలు చేసే ఈ పథకం కనుమరు గైందని రైతులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో వందల సంఖ్యలో పశువులు సీజనల్ వ్యాధులతో అనుకొని సంఘటనలతో మృత్యువాత పడుతున్నాయి. పాడి రైతులకు ఈ బీమా పథకం అములో ఉంటే పాడి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో బీమా పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం 2017-18వరకు కొనసాగించింది. పాడి రైతులకు మేలు చేసే ఈ బీమా పథకం రైతులకు అందక ఏడేళ్లు గడుస్తుంది. పాడి రైతులకు మేలు చేసే పశుక్ బీమా పథకాన్ని నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పభు త్వమైన పాడి రైతులపై మమకారంతో బీమా పథకాన్ని అందించాలని రైతులు కోరుతున్నారు.

మోడల్ పాఠశాలల్లో ప్రవేశానికి పరీక్ష

నిజాంసాగర్, ఏప్రిల్ 7: మండలంలోని అచ్చంపేట మోడల్ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశానికి ఆదివారం పరీక్షలు నిర్వహించారు. 6వ తరగతిలో ప్రవేశానికి 206 మంది మొత్తం విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 182 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 141 మంది దరఖాస్తు చేసుకోగా, 117 మంది హాజరైనట్లు వివరించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు.

సదాశివనగర్:సదాశివనగర్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు. 6వ తరగతి ప్రవేశానికి 536 మంది దరఖాస్తు చేసుకోగా 490 మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని డీఈవో రాజు పరిశీలించారు. మధ్యాహ్నం 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశపరీక్ష జరగగా 528 మంది విద్యార్థులకు గాను 464 మంది మాత్రమే పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 7: మండలంలోని మాసానిపల్లి గ్రామానికి చెందిన గొర్రె నవీన్ (34) శనివారం రాత్రి బైక్‌పై వెళుతుండగా మండలంలోని ఆత్మకూరు రోడ్డు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మాసానిపల్లి గ్రామానికి చెందిన గొర్రె నవీన్ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. శనివారం రాత్రి పనుల నిమిత్తం పెద్దరెడ్డి గ్రామానికి బైక్‌పైన వెళుతుండగా ఆత్మకూరు వద్ద గుర్తు తెలియని వాహనం తన బైక్‌ను ఢీకొనగా నవీన్ మృతి చెందినట్లు ఆయన తెలిపారు. తన భర్త మృతికి వరికోత కోసే హార్వెస్టర్‌పైన అనుమానం వ్యక్తపరుస్తూ మృతుడి భార్య గొర్రె సువర్ణ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కామారెడ్డిలో ఒకరి ఆత్మహత్య

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 7: కామారెడ్డి పట్టణంలో తాగుడుకు బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డిలోని సిరిసిల్లా రోడ్డులో నివాసముండే చింతల రాజు(36) జాతర్లలో స్వీట్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడు తాగుడుకు బానిస కావడంతో భార్య రేణుకా ఈ నెల 3న పిల్లలతో కలిసి తల్లిగారింటికి వెళ్లింది. తాగుడుకు బానిసైన రాజు క్షణికావేశంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మృతుడి తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

మొర్రిపండ్ల చెట్టుపై నుంచి పడి యువతి మృతి


భూలీ (ఫైల్)

రాజంపేట, ఏప్రిల్ 7: మండలంలోని షేర్ శంకర్ తండా పరిధిలోని మూడుమామిళ్ల తండాకు చెందిన యువతి మొర్రి పండ్ల చెట్టుపై నుంచి పడి మృతి చెందినట్లు ఎస్సై సంపత్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముద్రిచ భూలీ(22) మొర్రి పండ్లు తెంపడానికి సమీపంలోని అటవీకి వెళ్లి మొర్రిపండ్లు తెంపుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారీ చెట్టుపై నుంచి పడింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కాగా దీనిని గమనించిన భూలి తల్లి లక్ష్మీ, మరికొందరు వెంటనే భూలీని కామారెడ్డి ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స చేసిన వైద్యులు హైదరాబాద్‌కు రిఫర్ చేయగా అక్కడికి తరలించేలోపే మృతి చెందినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో గిరిజన రైతు మృతి

లింగంపేట, ఏప్రిల్ 7: మండలంలోని బద్రునాయక్ తండాకు చెందిన కేతావత్ కిషన్(38) అనే గిరిజన రైతు విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. కిషన్ తన వ్యవసాయ బోరు మోటారు వద్ద పశువుల కోసం కొడవలితో పచ్చిగడ్డి కోస్తుండగా కేబుల్ వైర్‌కు కొడవలి తగిలి విద్యుదాఘాతంతో అక్కడికి అక్కడే మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతుడికి భార్య అంజి, ఇద్దరు కొడుకులు ఉన్నారు. కిషన్ విద్యుదాఘాతంతో మృతి చెందడంతో తండాలో విషాదం చోటు చేసుకుంది. దీనిపై ఎస్సై చైతన్యకుమార్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదని ఆయన తెలిపారు.

బీజేపీలో చేరనున్న కౌలాస్ మాజీ సర్పంచ్

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 7: పెద్ద కొడప్‌గల్ మండలంలోని పోచారం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ రామారావ్ పటేల్ వెల్లడించారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తాను త్వరలో బీజేపీలో చేరనున్నట్లు వెల్లడించారు. 2005 నుంచి 2009 వరకు కౌలాస్ సర్పంచ్‌గా పనిచేసి గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించారు. నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై బీజేపీలో చేరనున్నట్లు రామారావ్ పటేల్ తెలిపారు.

'సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం'

తాడ్వాయి, ఏప్రిల్ 7: జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో గెలిచిన బీబీ పాటిల్ బీజేపీలోకి వెళ్లారని ఆయన గతంలో నియోజకవర్గం పట్ల ఎలాంటి శ్రద్ధ చూపలేదని అన్నారు. ఈ ఎన్నికల్లో బీబీ పాటిల్‌కు గట్టిగుణపాఠం నేర్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్రాంరెడ్డి, రాజు, శ్యామ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'జహీరాబాద్ అభివృద్ధికి బీబీ పాటిల్ చేసిందేమీ లేదు'

సదాశివనగర్, ఏప్రిల్ 7: జహీరాబాద్ అభివృద్ధికి బీబీ పాటిల్ చేసిందేమీ లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి, వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014 ముందు పార్లమెంట్ సభ్యునిగా ఉన్న సురేష్ షెట్కార్ తెలంగాణ కోసం పార్లమెంట్‌లో ఎన్నో వాదనలు వినిపించడంతో పాటు తెలంగాణ రావడానికి ఎంతో కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ సదాశివరెడ్డి, గంగాధర్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాగయ్య, మాజీ అధ్యక్షుడు లింగాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది

● జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్


భిక్కనూరులో మాట్లాడుతున్న గాలి అనిల్‌కుమార్

భిక్కనూరు, ఏప్రిల్ 7: అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేసి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం భిక్కనూరులో పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల్లో తెలంగాణ రాష్ట్రంలో జరిగినంత అభివృద్ధి దేశంలో ఎక్కడా జరగలేదని అన్నారు. అన్నివర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రాష్ట్రంలో ముందుకు సాగిందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి చేసిందేమి లేదన్నారు. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్న ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు.

అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం

● మాజీ ఎమ్మెల్యే గంప గోవర్దన్

జహీరాబాద్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దామని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. కామారెడ్డిలో సీఎం కేసీఆర్ ఓడిపోతాడని కలలో కూడా ఎవరు అనుకోలేదు. కేసీఆర్ గెలుపునకు తాను, తమ నాయకులు, కార్యకర్తలు చాలా కష్టపడ్డారని, కానీ ప్రజల తీర్పుకు ప్రతిఒక్కరూ కట్టుబడి ఉండాల్సిందేనని అన్నారు. కేసీఆర్ ఓటమికి కామారెడ్డి బీఆర్ఎస్ కార్యకర్తల తరుపున, నా తరుపున కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుకు క్షమాపణలు చెప్పానని అన్నారు. రాజకీయంలో ఎత్తుపల్లాలు ఉంటాయని, ఇలాంటి వాటిని ఎదుర్కొన్నప్పుడే నిజమైన నాయకుడవుతాడని అన్నారు. కామారెడ్డిలో రూ.150కోట్లతో అభివృద్ధి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చి గెలిచిన రమణారెడ్డి, ప్రజలకు ఇచ్చిన విధంగా ప్రతీ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి అత్తెల్లి శ్రీనివాస్, రాజంపేట మండల అధ్యక్షుడు బల్వంత్‌రావు, విండో చైర్మన్లు నల్లవెళ్లి అశోక్, భూంరెడ్డి, రాజాగౌడ్, వైస్ ఎంపీపీ యాదగిరి, ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ సాయిరెడ్డి, నాయకులు ఆంజనేయులు, జూకంటి మోహన్ రెడ్డి, రాంచంద్రం, రాజమౌళి, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలి : ఎమ్మెల్యే పోచారం


నసురుల్లాబాద్‌లో మాట్లాడుతున్న పోచారం

నసురుల్లాబాద్, ఏప్రిల్ 7: రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నసురుల్లాబాద్ మండల కేంద్రంలో ఆదివారం నసురుల్లాబాద్, బీర్కూర్ ఉమ్మడి మండల బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ని బాన్సువాడ నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీ తీసుకురావాలని కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. ప్రజలకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తానని చెప్పిన వీడియోను స్క్రీన్‌పై కార్యకర్తలకు చూపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మాయ మాటలు చెప్పి మోసం చేసి అధికారంలోకి వచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, నసురుల్లాబాద్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పెరిక శ్రీనివాస్, జిల్లా కో ఆప్షన్ మెంబర్ మజీద్, ఎంపీపీ పాల్త్య విఠల్, వైస్ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గంగారాం యాదవ్, ఎంపీపీ రఘు, మాజీ సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ సర్పంచ్ దుర్గం శ్యామల, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

అధికారం లేకపోతే చచ్చిపోతామా?

● ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్


సమావేశంలో మాట్లాడుతున్న గంప గోవర్ధన్

భిక్కనూరు, ఏప్రిల్ 7: ప్రస్తుత రాజకీయం చూస్తుంటే బాధనిపిస్తుందని, అధికారం పోగానే పార్టీలు మారడం సిగ్గు అనిపియ్యడం లేదా ? అధికారం లేకపోతే చచ్చిపోతామా అని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఎక్కడో మహారాష్ట్రలో వ్యాపారం చేసుకునే బీబీ పాటిల్‌కు పిలిచి టికెట్ ఇచ్చి ఎంపీగా గెలిపిస్తే రాష్ట్రంలో అధికారంల కోల్పోగానే తన వ్యాపారాల కోసం బీజేపీలోకి మారాడని, ఎక్కడో బర్ల కొట్టంలో ఉండే గాల్‌రెడ్డిని ఎంపీటీసీగా గెలిపించుకుని ఎంపీపీ చేస్తే ఆ దొంగ రూ.30లక్షలకు అమ్ముడుపోయి కాంగ్రెస్‌లో చేరాడని ఆరోపించారు. పార్టీ మారడానికి, ఏమైనా చీము, నెత్తురు ఉంటే వెంటనే ఎంపీపీ పదవీకి రాజీనామా చేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడిగా చాలా సంవత్సరాలు చేసిన ఆత్మ కమిటీ చైర్మన్‌గా కొనసాగిన దరిద్రుడు నర్సింహారెడ్డి ఎన్నికలు కాగానే ఎన్నికలకు సంబంధించిన లెక్కలు ఎక్కడ అడుగుతారో అని అన్నిచ్చిన పార్టీని మోసం చేసి దొంగలెక్క కాంగ్రెస్ పంచన చేరాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను కూడా టీడీపీ నుంచి వచ్చానని కానీ నేను ఆ పార్టీకి, ఆ ఎమ్మెల్యే పదవికి అప్పడు రాజీనామా చేసి ప్రజల ముందుకు వచ్చానని తెలిపారు. కానీ ఇప్పుడు అధికారం లేకుండా కొంతమంది ఉండలేకపోతున్నారని ఉదయం ఒక పార్టీ, మధ్యాహ్నం ఇంకో పార్టీ, సాయంత్రం మరో పార్టీలో చేరుతున్నారని ఆరోపించారు. ఇలాంటి రాజకీయాలు మంచివి కాదన్నారు.

నిజాంసాగర్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

● హాజరైన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు

నిజాంసాగర్, ఏప్రిల్ 7: నిజాంసాగర్ మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు హాజరయ్యారు. రాబోయే ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గెలుపుకు కృషిచేయాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. పార్టీని గ్రామ గ్రామాన మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయ ప్రదీప్, మల్లికార్జున్, రవీందర్ రెడ్డి, పండరి, రామకృష్ణ, తదితరులున్నారు.

'ఎంపీ బీబీ పాటిల్ అభివృద్ధి చేసింది ఏమీ లేదు'

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 7: ఎంపీ బీబీ పాటిల్ పది సంవత్సరాలుగా చేసిన అభివృద్ధి ఏమి లేదని ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొన్నటి వరకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు రైతుల గురించి ఎప్పుడు అయిన పట్టించుకున్నారా ఏ గ్రామంలో అయినా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టించారా, రైతుల ప్రజల సమస్యలు పట్టించుకున్నారా అని అన్నారు. లింగంపేట్ మండలంలోని ఐలాపూర్ గ్రామానికి చెందిన రైతు కొనుగోలు కేంద్రం వద్ద మృతి చెందితే కనీసం పరామర్శించలేదని అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ఎమ్మెల్యే మదన్ మోహన్ పరామర్శించి ఆర్థిక సహాయం అందించారని అన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోని నాయకుడు బీబీ పాటిల్ అని పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కుతో డిపాజిట్ కూడా రాకుండా బుద్ధి చెబుతారని ఆయన అన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీతో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను గెలిపించుకుంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగం గోపి కృష్ణ, సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సామెల్, వెంకట్రాంరెడ్డి, విద్యాసాగర్ పాల్గొన్నారు.

'జహీరాబాద్ ఎంపీ సీటును మోదీకి బహుమతిగా ఇద్దాం'

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 7: జహీరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని గెలిచి దేశ ప్రధాని మోదీకి బహుమతిగా అందచేద్దామని జహీరాబాద్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్ పేర్కొన్నారు. ఆదివారం జుక్కల్ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా బీబీ పాటిల్ మాట్లాడుతూ బీజేపీ కార్యకర్తలంతా తమ స్వంత బూత్‌లను పటిష్టం చేసుకుని ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. దేశం మొత్తం మీద 400 స్థానాలు గెలిచి తిరిగి బీజేపీ కేంద్రంలో అధికారంలోకి రానుందని తెలిపారు. అనంతరం కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ జహీరాబాద్ నియోజక వర్గం మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు సరిహద్దులో ఉన్నందున అభివృద్ధి సరిగ్గా జరగలేదని, గత 10 సంవత్సరాల నుంచి అంతో ఇంతో అభివృద్ధి జరిగిందని, ఇక్కడ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను గెలిపించుకుని అభివృద్ధికి బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షురాలు అరుణతార, మాజీ ఎమ్మెల్యే గంగారాం, నాయకులు బద్దం మహిపాల్ రెడ్డి, బాణాల లక్ష్మారెడ్డి, రవిగౌడ్, శ్రీధర్ కులకర్ణి, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

బీరప్ప గుడి ప్రారంభోత్సవం

మద్నూర్, ఏప్రిల్ 7: మద్నూర్ మండల కేంద్రంలో నూతన బీరప్ప ఆలయాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులతో పాటు తదితరులు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణం పూర్తి కావడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పూజా కార్యక్రమాలను ప్రతిరోజు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో బండి విజయ్, మాజీ సర్పంచ్ దరాస్ సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం'

తాడ్వాయి,ఏప్రిల్ 7: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పిలుపునిచ్చారు.మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా బీబీపాటిల్ 10 సంవత్సరాల పాటు పదవిని అనుభవించి పార్టీని వీడిచి వెళ్లిపోయాడని విమర్శించారు.ఆయన ఉన్న సమయంలో జహీరాబాద్ నియోజకవర్గాన్ని ఎప్పుడు అభివృద్ధిచేయలేదని అన్నారు. తనసొంత వ్యాపారాలు చేసుకోవడానికి బీఆర్ఎస్ పార్టీని ఉపయోగించుకున్నాడని మండిపడ్డారు. ఇలాంటి బీబీపాటిల్‌కు గట్టిగుణపాఠం చెప్పాలని కోరారు. మరో అభ్యర్థి కాంగ్రెస్ పార్టీ తరపున పోటిచేయబోతున్న సురేష్‌షెట్కార్ గతంలో ఎంపీగా ఉన్న సమయంలో ఎలాంటి అభివృద్ధిచేయాలేదన్నారు.ఆయన మరోసారి కాంగ్రెస్ పార్టీ టికెట్ తెచ్చుకుని ప్రజలకు మోసం చేయడానికి చూస్తున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జనార్ధన్‌గౌడ్, నాయకులు సాయిరెడ్డి, కపిల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నర్సింలు, నారాయణ,కొండ హనుమండ్లు,కృష్ణమూర్తి, రామ్‌రెడ్డి, వెంకట్‌రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ విజయం పక్కా'

మద్నూర్, ఏప్రిల్ 7: జుక్కల్ నియోజకవర్గానికి సంబంధించిన భారతీయ జనతా పార్టీ సమావేశంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణా రెడ్డి, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాం, అరుణ తార, జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ తెలుసన్నారు. బీజేపీ భారీ మెజార్టీతో గెలుస్తుందని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలతో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికి తెలుపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండల పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరుతున్న ఎంపీటీసీలు, మాజీ వార్డు సభ్యులు

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

దోమకొండ, ఏప్రిల్ 7: ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ సమక్షంలో హైదరాబాద్‌లో ఆదివారం దోమకొండకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు డీసీసీ కార్యదర్శి తాటిపల్లి శ్రీకాంత్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీటీసీ కోట సదానంద, మాజీ ఎంపీటీసీ చింతల రవి, మాజీ వార్డు సభ్యులు తాటిపల్లి శ్రీధర్, శివ రాంమందిర్ ఆలయ కమిటీ చైర్మన్ అబ్రబోయిన రాజేందర్, జలకరి శ్రీనివాస్‌లకు షబ్బీర్‌అలీ కండువకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, జడ్పీటీసీ తీగల తిర్మల్ గౌడ్, అంబార్‌పేట ఎంపీటీసీ పిరంగి రాజేశ్వర్,మండలయూత్ అధ్యక్షుడు ఆశబోయిన శ్రీనివాస్, నాయకులు రాములు, బాల్‌రాజు, ముత్తగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గొట్టిముక్కుల గ్రామం నుంచి..

ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ సమక్షంలో హైదరాబాద్‌లో ఆదివారం మండలంలోని గొట్టిముక్కుల గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు గ్రామ సీనియర్ నాయకులు మద్దుల సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో దర్పల్లి సంజీవరెడ్డి, మాజీ వార్డు సభ్యులు దర్పల్లి వెంకట్‌రెడ్డి, మాదగారి సత్యంగౌడ్, చంద్రంగౌడ్, సంఘగౌడ్, స్వామి, శంకర్, బస్వయ్య, రాజాగౌడ్, గంగయ్య, బాపురెడ్డి, చిన్న బాపురెడ్డిలు పార్టీలో చేరినట్లు తెలిపారు.కార్యక్రమంలో నాయకులు నత్తి సంజీవ్ ఉన్నారు.

బీబీపేట: మండలానికి చెందిన బీఆర్ఎస్ ముఖ్యనాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుతారి రమేష్ ఆధ్వర్యం లో గాంధీభవన్‌కు వెళ్లి ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు .బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఐడీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రాసేనారెడ్డి, తిరుపతిరెడ్డి, బీబీపేట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌గౌడ్, బీబీపేట మండల వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ బాశెట్టి నాగేశ్వర్,మాజీ సర్పంచ్‌లు వెంకట్రావు, రామ్‌రెడ్డి, రమణగౌడ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

దోమకొండ, ఏప్రిల్ 7: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి విద్యాలయంకు చెందిన 1997-98 బ్యాచ్‌కు చెందిన ఏడవ తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగరిత్యా, వ్యాపారరిత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన విద్యార్థులు ఒకచోట చేరి ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకుని క్షేమసమాచారాలను తెలుసుకున్నారు. అనంతరం పాత జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ రోజంతా సంతోషంగా గడిపారు. ఈ మేరకు ఉపాధ్యాయులను సన్మానించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు.

బూత్ లెవల్ అధ్యక్షుల నియామకం

మద్నూర్, ఏప్రిల్ 7: భారతీయ జనతా పార్టీని గ్రామీణ ప్రాంతాల్లో, గల్లీల్లో, బూత్ లెవల్‌లలో మరింత పటిష్టం చేయడానికి బూత్ అధ్యక్షుల నియామకం చేపట్టినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు తుకారాం తెలిపారు. ఉమ్మడి మద్నూర్, డోంగ్లీ మండలాల్లోని ఆయా గ్రామాల్లో భారతీయ జనతా పార్టీ బూత్ లెవల్ అధ్యక్షుల నియామకం జరిగింది. వారిని మద్నూర్ కార్యాలయంలో సన్మానించామన్నారు. బూత్ లెవల్ అధ్యక్షులతో మండల పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను తెలుపాలన్నారు.

దొంగతనాల నివారణకు యువకులు సహకరించాలి

భిక్కనూరు, ఏప్రిల్ 7: దొంగతనాల నివారణకు యువకులు తమతో సహకరించాలని ఎస్సై సాయికుమార్ కోరారు. ఆదివారం మండలంలోని బస్వాపూర్ గ్రామంలో పోలీసులు యువకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామంల 44వ జాతీయరహదారిని ఆనుకుని ఉండటంతో దొంగతనాలు జరగడానికి ఎక్కువ ఆస్కారం ఉందని, గ్రామంలో దొంగతనాలు, నేరాల నియంత్రణకు గ్రామరక్షణ దళం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై-2 రాంచంద్రనాయక్, యువకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

భిక్కనూరు, ఏప్రిల్ 7: మండలంలోని బస్వాపూర్ గ్రామంలో మృతుడు సిద్దయ్య కుటుంబానికి గ్రామ మాజీ సర్పంచ్ తుడుం పద్మస్వామి దంపతులు ఆదివారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబడి స్వామి యువసేనా ఆధ్వర్యంలో గ్రామంలో సేవా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు.


బాలుర వసతి గృహం వద్ద కలుసుకున్న పూర్వ విద్యార్థులు

50 ఏళ్ల తర్వాత హాస్టల్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 7: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని షెడ్యూల్ కులాల బాలుర వసతి గృహంలో ఉంటూ 1970 నుంచి 1995 వరకు విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడినటువంటి అందరు కూడా కలుసుకొని ఆనందంగా గడిపారు. అలనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ విద్యాభ్యాసంలో వారు ఎదుర్కొన్నటువంటి వివిధ అంశాలను చర్చించుకున్నారు. ప్రస్తుతం వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు క్రమశిక్షణతో చదివి మంచి రంగాలను ఎంచుకుని ఆ రంగాల్లో ఉన్నత స్థానాలను అధిరోహించడానికి కష్టపడి చదవాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ పూర్వ విద్యార్థులు రెడ్డిరాజయ్య, అష్టమాలజిస్ట్ బీవీరెడ్డి, ప్రముఖ న్యాయవాది జగన్నాథం, ఎంపీడీవో లక్ష్మణ్, ఏఏఓ బాబు, ఉపాధ్యాయులు పోచయ్య, శ్రీనివాస్, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ సాయిలు, బలరాంలు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	- ప్రాజెక్ట్(జడ్)
శాంతి	- టిల్ స్క్వేర్
ప్రియా 70	- ది ఫ్యామిలీ స్టార్

బాన్సువాడ

మహేశ్వరి	- ది ఫ్యామిలీ స్టార్
వెంకటేశ్వర	- మంజుమ్మల్ బాయ్స్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

